సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు మంగళవారం వివతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ తాగునీరు సక్రమంగా సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం, అంబేడ్కర్ పేరుతో చేపట్టిన పుప్పాలగూడ వార్డు కార్యాలయం నిర్మాణం పెండింగ్‌లోనే ఉందన్నారు. గతంలో రూ.45 లక్షలు కేటాయించినా పూర్తి చేయకపోవడం తగదన్నారు. అంతేగాకుండా పుప్పాలగూడలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖాన ఎప్పుడూ మూసే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధనరాజ్, కౌన్సిలర్ నవీన్‌కుమార్, నాయకులు ఎం.లక్ష్మయ్య, ఎ.లక్ష్మణ్‌రావు, బీ. ఉపేంద్రనాథ్‌రెడ్డి, సంతోష్, రమేశ్, అశోక్, కిరణ్, దిపిల్, షేక్ ఆరీఫ్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి బీసీ ఉద్యోగుల పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న బీసీ ఉద్యోగులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీగా బడుగు బలహీన వర్గాల వ్యక్తి డాక్టర్ జానయ్య నియమకంపై ఆ విశ్వవిద్యాలయంలోని బీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో వీసీ భవనం ఎదుట సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తున్నదన్నారు. అలాగే నేటి నుంచి ప్రారంభం కానున్న కులగణనతోనూ రాజకీయంగా, విద్య, ఉద్యోగవరంగా కూడ బీసీలకు ఎంతో మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సందర్భంగా సీఎం, మంత్రులు, పీసీసీ చీఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దశరత్, కార్యదర్శులు రమేశ్, కృష్ణ, సంతోష్, జనార్దన్, నాన్ టీచింగ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో నవగ్రహ విగ్రహాల ధ్వంసం


ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టుకాలనీలోని హనుమాన్ ఆలయంలో నవగ్రహ విగ్రహాల ధ్వంసం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం ఉదయం పూజారి వచ్చిచూసేసరికి విగ్రహాలు ధ్వంసమై ఉన్నాయి. విషయం తెలుసుకున్న కాలనీవాసులు స్థానిక ప్రజాప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించి స్థానికులు, పూజారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి ధ్వంసం చేసి ఉండవచ్చని పోలీసులు భావించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు అయ్యప్ప భక్తులు, స్థానికులు, ప్రజాప్రతినిధులు దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఘటనా స్థలాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సందర్శించారు. అదే విధంగా బీజేపీ నేతలు జాతీయరహదారిపై ధర్నా చేపట్టారు. దుండగులను పట్టుకోవడంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

రాజేంద్రనగర్: ఆలయాలపై దాడుల చేస్తున్న దుండగులను కఠినంగా శిక్షించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బజరంగ్ దళ్ నాయకుడు నిరుడు పవన్ సాయి డిమాండ్ చేశారు. బుద్వేల్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ..శంషాబాద్ విమానాశ్రయ కాలనీలోని హనుమాన్ ఆలయ ఆవరణలోని నవగ్రహాల విగ్రహాలను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. నిందితులను పోలీసులు వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని కోరారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి: మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని చేయాలని మున్సిపల్ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గా కన్వెన్షన్ సమీపంలో మండల కార్యదర్శి ఆనంద్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించిన ఎవరూ పాటించడం లేదన్నారు. రాష్ట్రంలో కార్మికులందరిని పర్మినెంట్ చేసేవరకు రూ. 26 వేలు వేతనం చెల్లించాలని కోరారు.



మాట్లాడుతున్న నాయకులు

మున్సిపల్ కార్మిక సంఘం ఎన్నిక..

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మున్సిపల్ కార్మిక నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై సాయిలు, ఉపాధ్యక్షులుగా శేఖర్, పెంటయ్య, సంతోష్ , చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా ఏ రాజు, సహాయకార్యదర్శులుగా రంజిత్, ఉషా రాణి, మహేశ్, కౌన్సిల్ సభ్యులుగా శ్యామలమ్మ, రాజు, శంకరమ్మ, మోహన్, ఐలేశ్ , యాదమ్మ, దేవేందర్, రాములమ్మ, నరేందర్, స్వరూప, రమేశ్, లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



పచ్చగా.. ఆకర్షణీయంగా..

డివైడర్ల మధ్యన పూల మొక్కలు ఏర్పాటు చేశారు. మాదాపూర్‌లోని మినీ చార్మినార్ నుంచి న్యాక్ గేట్ వరకు, అయ్యప్పసొసైటీ ఎక్స్‌రోడ్ నుంచి కావూరి హిల్స్ వరకు, అండర్‌పాస్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది పలు రకాల మొక్కలను పెంచుతున్నారు. పచ్చదనం ఉట్టిపడుతుండడంతో చూపరులను ఆకర్షిస్తున్నాయి - మాదాపూర్

ఇంటింటి సర్వేకు సహకరించాలి

రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్


రవి కుమార్, సర్కిల్ డిప్యూటీ కమిషనర్


బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో బుధవారం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానున్నదని, ఇళ్లవద్దకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ కోరారు. మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. సర్వే కోసం అత్తాపూర్, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం డివిజన్లలో మొత్తం 631 మంది ఎన్యూమరేటర్లను నియమించామన్నారు. వీరు 150 నుంచి 175 కుటుంబాల డేటాను సేకరించేందుకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. అంతేగాకుండా సర్వే పర్యవేక్షణకు 54 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. బుధవారం ఉదయం 9 నుంచి సర్వే ప్రారంభమవుతుందని తెలిపారు. మూడు రోజుల పాటు ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లోని ఇంటి నెంబర్ తదితర వివరాలను నమోదు చేసుకుంటారన్నారు. నాలుగో రోజు నుంచి ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేస్తారని తెలిపారు. దరఖాస్తులను పూర్తికి ప్రజలు కొంత సమయం కేటాయించి పూర్తి సమాచారాన్ని అందించాలని కోరారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఏర్పాట్లు పూర్తి

బండ్లగూడ: నేటి నుంచి ప్రారంభం కానున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేశామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 22 డివిజన్లలో 42,107 ఇళ్లు ఉన్నాయన్నారు. మొత్తం ఎన్యుమరేషన్ బ్లాక్‌ల సంఖ్య 293 కాగా, సూపర్‌వైజర్ల సంఖ్య 29, 10 శాతం రిజర్వ్‌డ్ ఎన్యుమరేటర్లు 29 గాను 30 మందిని నియమించామని పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి 8 వరకు హౌస్ లిస్టింగ్ ఎన్యుమరేషన్ బ్లాక్‌లో ఇళ్లను గుర్తించి డోర్ స్టిక్కరింగ్ వేస్తామని తెలిపారు. 9 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (పూర్తయ్యే వరకు), ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేస్తామని పేర్కొన్నారు.

కోకాపేటలో ప్రారంభించనున్న ఎమ్మెల్యే..

మణికొండ: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను బుధవారం స్థానిక ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించనున్నట్లు నార్సింగి మున్సిపల్ కమిషనర్ టీ కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కోకాపేట కమ్యూనిటీ హాల్‌లో జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నీటి సరఫరా నిలిపివేత

మణికొండ: సింగూరు ప్రాజెక్టు వద్ద పైప్‌లైన్ పగిలిపోవడంతో నీటి సరఫరాను నిలిపేసి మరమ్మతులు చేపట్టామని మణికొండ జీఎం మహేందర్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు నీటి సరఫరాలో అంతరాయం కలిగిందని మరమ్మతులు పూర్తి కాగానే బుధవారం సాయంత్రం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని, అప్పటి వరకు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ ఆరాంఘర్ ఎక్స్ రోడ్డు పిల్లర్ నంబర్ 313 సమీపంలో ఈ నెల 4న 35–40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ కానిస్టేబుల్ గమనించిన పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా స్థానికంగా ఆరాతీయగా అధికంగా మద్యం తాగడంతోనే ఫిట్స్ వచ్చి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని వారు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డుకు గాయాలు

రాజేంద్రనగర్: రోడ్డు దాటుతున్న ఓ సెక్యూరిటీ గార్డును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ హార్టికల్చర్ యూనివర్సిటీలో మల్లేశ్ (42) సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తూ పిల్లర్ నంబర్ 176 ఉప్పర్‌పల్లి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మల్లేశ్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి రాజేంద్రనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం నేపథ్యంలో రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులతో పాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటీలకు ఆహ్వానం

చార్మినార్: ఈనెల 14న ఆల్ ఇండియా జవహర్‌లాల్ నెహ్రూ స్కూల్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ స్కూల్ చెస్ టోర్నమెంట్ బాల బాలికల కోసం అండర్–16 విభాగంలో పోటీలు నిర్వహించనున్నామని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ తెలిపారు. పోటీల్లో పాల్గొనడానికి ఈనెల 12వ తేదీ ఆఖరు అని ఆయన స్పష్టం చేశారు. నగరంలో జరిగే ఈ పోటీలలో ఆటగాళ్లందరూ గెలిచినా ఓడినా అన్ని రౌండ్లు ఆడవచ్చునన్నారు. సర్టిఫికెట్లతో పాటు విజేతలకు ప్రైజ్ మనీ, మెరిట్ సర్టిఫికేట్, మెడల్స్‌ను అదే రోజు అందజేయడం జరుగుతుందన్నారు. జనవరి 1, 2008 తర్వాత జన్మించిన వారు ఈ టోర్నమెంట్‌కు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 8500212306 వాట్సాప్ నెంబర్, www.apjedu2001.com వెబ్ సైట్ లో సంప్రదించాలన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంట్లోని చెత్తను ఇంటి వద్దకు వచ్చే కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. 17వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీ, 18వ డివిజన్ మాంచన్‌పల్లి, 19వ డివిజన్ అభ్యుదయనగర్‌లో తడి, పొడి చెత్త సేకరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు యాదగిరి, శ్రీధర్, సురేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


సభ్యులను సన్మానిస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: బాలాజీనగర్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా హర్షవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుధీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అర్జున్‌గౌడ్, సభ్యులుగా నరేందర్‌గౌడ్, వీరేశం, వీరారెడ్డి, నర్సింహాగౌడ్, జయన్న తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ అందరి సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అధ్వానంగా లింగంపల్లి రైల్వేస్టేషన్ రోడ్డు



శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో రోడ్డు అధ్వానంగా మారింది. ముఖ్యంగా స్టేషన్‌లోని 6వ ప్లాట్‌ఫారం, దూబే కాలనీ గేటు వద్ద రోడ్డు దెబ్బతింది. దీంతో ఉదయం , సాయంత్రం వేళల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులను తీసుకు వెళ్లేందుకు వచ్చే వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డు దెబ్బతినడంతో వాహనాలు నెమ్మదిగా సాగుతుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. రైల్వే ఉన్నతాధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

శివరాంపల్లి ఉపాధ్యాయురాలికి సన్మానం


రూపాదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

రాజేంద్రనగర్: శివరాంపల్లి ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు రూపాదేవి పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ సాధించడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయుల బృందం మంగళవారం ఆమెను ఘనంగా సన్మానించి అభినందించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కిషన్ మాట్లాడుతూ.. ఉన్నత చదువుతో పాటు సకల కళలు కలిగి శ్రమించి పని చేసేతత్వం గల రూపాదేవి పాఠశాలకు రావడం విద్యార్థుల అదృష్టమన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. రూపాదేవిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. సన్మాన గ్రహీత రూపాదేవి మాట్లాడుతూ.. మంచిగా చదువుకుని సక్సెస్ బాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మత్స్యకారులను దగా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం'


మెట్టు సాయికుమార్

అబిడ్స్: గత పదేళ్ల మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులను పలు విధాలుగా దగా చేశారని రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజులను, గంగపుత్రులను పట్టించుకోలేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అన్ని చెరువులలో ఉచితంగా చేపపిల్లలను వదులుతుంటే.. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో 571 మంది మత్స్యకారులు చనిపోతే కనీసం వారి కుటుంబాలను కానీ, వారికి ఎక్స్‌గ్రేషియా కానీ ఇవ్వలేదని మెట్టు సాయికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం.. మత్స్యకారులకు, ముదిరాజులకు పలు విధాల సంక్షేమం చేస్తుంటే కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేక దిగజారే విధంగా ప్రకటనలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వారి చేష్టలు మార్చుకోవాలని లేనిచో మరోసారి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మెట్టు సాయికుమార్ అన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

బండ్లగూడ: కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉంటారని ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో సంబంధిత పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు సురేశ్‌గౌడ్, అంతారం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శంషాబాద్ రూరల్: మండలంలోని రామంజాపూర్ గ్రామంలో జిమ్స్ హోమియోపతి వైద్య కాలేజీ–ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రీ డయాబెటిక్, డయాబెటిక్ పేషంట్లకు వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు జ్యోతి, ఫనీష్, ఆకాశం దీప్‌దాస్, హరిష్మా తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

రాజేంద్రనగర్: మైనర్‌తో అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000ల జరిమానా విధిస్తూ ఉప్పర్‌పల్లిలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.ఆంజనేయులు మంగళవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడకు చెందిన మైనర్ బాలిక దుర్గానగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. డ్రైవర్ వెంకటేశ్ (50) బాలికను ప్రతిరోజు తన ఆటోలో స్కూల్‌కు తీసుకెళ్లేవాడు. 2019 జూలై 31న స్కూల్ విడిచిన అనంతరం బాలికను ఇంటికి తీసుకెళ్లే సమయంలో స్థానికంగా ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో మైనర్ బాలిక కేకలు వేయడం, రోధించడంతో తల్లిదండ్రులకు చెబితే చంపేస్తానని చెప్పి ఇంటి వద్ద దింపాడు. భయభ్రాంతులకు గురైన బాలికకు జ్వరం రావడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తల్లి బాలికను గట్టిగా అడగగా ఆటో డ్రైవర్ చేసిన లైంగిక దాడిని వెల్లడించింది. దీంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. బాధిత బాలికకు రూ.50 వేలు అందించాలని ఆదేశించారు.

పొంచి ఉన్న ప్రమాదం..!



అత్తాపూర్: అత్తాపూర్‌లోని హుడాకాలనీ సిక్‌చానీ వెళ్లే ప్రధాన రహదారిలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదం పొంచి ఉన్నది. దాని చుట్టూ కంచె లేకపోవడంతో పాటు చెత్తా చెదారంతో అస్తవ్యస్తంగా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

యాకుత్‌పురా: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ సూచించారు. మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం దారుషిపా సాలాజంగ్ రోటారీ వద్ద హెల్మెట్ వాడకంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ దక్షిణ విభాగం డీసీపీ వేంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

యువకులు సమాజ సేవలో పాల్గొనాలి

గోల్కొండ: యువకులు సమాజ సేవలో చురుగ్గా పాల్గొనాలని ఇంటర్నేషనల్ హ్యూమెన్ రైట్స్ పీస్ అంబాసిడర్ మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం టోలిచౌకీలోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఆయన పలువురు యువకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా తాను మానవ హక్కుల పరిరక్షణ కోసమే కాకుండా నిరుపేదలకు అండగా ఉంటున్నానన్నారు. ఈ 15ఏళ్ల కాలంలో ఎందరో యువకులు తమ సంస్థలో చేరి సమాజ సేవలో పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

కల్తీ కారంపొడిని విక్రయిస్తున్న నిందితుడి అరెస్ట్

గన్‌ఫౌండ్రీ: విషపూరితమైన రంగులు, రసాయనాలు కలిపి కల్తీ మిర్చీ పౌడర్‌ను తయారు చేస్తున్న గోదాంపై మంగళవారం సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 30 కిలోల తాలు మిర్చీ పౌడర్, రంగులు కలిపిన 35 కిలోల కల్తీ మిర్చీ పౌడర్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్‌కు చెందిన రూపారామ్(39) గత కొంతకాలం క్రితం నగరానికి వచ్చి అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో బట్టల దుకాణం ప్రారంభించాడు. దుకాణం సరిగ్గా నడవకపోవడంతో కల్తీ కారం విక్రయాలను ప్రారంభించాడు. దీని కోసం ఉస్మాన్‌గంజ్‌లోని తన ఇంట్లోనే కారం ఫ్లోర్‌మిల్, ప్యాకింగ్ యంత్రాలను కొనుగోలు చేసి అమర్చాడు. స్థానిక ఏజెంట్ల నుంచి స్వస్తిక్ బ్రాండ్ కారంపొడి ప్యాకెట్లను కొనుగోలు చేశాడు. మార్కెట్లో తక్కువ నాణ్యత కలిగిన మిర్చిని కొనుగోలు చేసి వాటి నుంచి వచ్చిన తాలు మిర్చీ పౌడర్ విషపూరితమైన రసాయనాలు, రంగులు కలిపి నకిలీ కారం తయారు చేసి విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అతని ఇంటిపై దాడి చేసి కల్తీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు తుదిపరి దర్యాప్తు కోసం నిందితుడిని అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.